APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth

విలేకరులు కావలెను

స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు

కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు మండల రిపోర్టర్స్ కావలెను.

గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.

ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.

ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక : 173 | పేజీలు : 04 వెల రూ. 2/- | ఆదివారం 16-08-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 173 | PAGES : 04 PRICE : 2 | SUNDAY 16 AUGUST 2026



### మనం అడ్రస్ లేనివాళ్లం కాదు
## మన కేరాఫ్ అడ్రస్ అమరావతి

- రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్
- విజయవాడలో 80వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్
- ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని తమ విధానమని మరోసారి స్పష్టీకరణ
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని వెల్లడి
- కులమతాలకు అతీతంగా స్వర్ణాంధ్ర సాధన కోసం పనిచేద్దామని పిలుపు

**అమరావతి :** కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమష్టి కృషితో స్వర్ణాంధ్రను సాధించు కుందామని రాష్ట్ర విద్య, - మిగతా 2 లో

## ఏటా డీఎస్సీ, యువతకు
# 20 లక్షల ఉద్యోగాలు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులు
- 2047 నాటికి స్వర్ణాంధ్ర నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడి
- ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని, యువతకు భారీగా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ
- వచ్చే ఏడాది మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్న సీఎం
- అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించి తీరుతామన్న సీఎం చంద్రబాబు



**అమరావతి :** అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకం చేస్తూ 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు వేశామని, ఇక వికాసం నుంచి వైభవం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తామని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు చెప్పనివాటిని కూడా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని వివరించారు.ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 'సూపర్ సిక్స్' పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. పెన్షన్లు పెంచి పేదలకు ఆర్థిక భద్రత కల్పించామని, కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేస్తున్నామని అన్నారు. 'స్త్రీశక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళలకు వరంగా మారిందని, అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నామని చెప్పారు. త్వరలోనే గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లను విస్తరిస్తామని హామీ ఇచ్చారు. సమాజంలోని ఉన్నత వర్గాలు అట్టడుగు వర్గాలకు చేయూతనిచ్చేలా - మిగతా 2 లో

## ప్రజాస్వామ్య విలువలకు
# పునరంకితం కావాలి



- వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి
- 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన జగన్
- ప్రజాస్వామ్య సూత్రాలకు పునరంకితం కావాలని పిలుపు
- స్వాతంత్ర్య సమరయోధుల నుంచి స్ఫూర్తి పొందాలని సూచన
- ఉజ్వల, సమ్మిళిత భారతదేశం కోసం కృషి చేద్దామన్న మాజీ సీఎం

**అమరావతి :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశ ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఉదయం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఆయన - మిగతా 2 లో

## దేశవ్యాప్తంగా కోటి మంది
# యువతకు ఏఐ శిక్షణ

- పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్
- యువతకు మోదీ పంద్రాగస్టు కానుక
- 80వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కీలక ప్రకటన చేసిన ప్రధాని మోదీ
- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్
- 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం లక్ష్యం, క్రీడా ప్రతిభ అన్వేషణకు కొత్త పథకం
- దేశవ్యాప్తంగా కోటి మంది యువతకు ఏఐలో నైపుణ్య శిక్షణ
- సెమీకండక్టర్, అణు విద్యుత్ రంగాల్లో భారీ లక్ష్యాల నిర్దేశం



**ఢిల్లీ :** దేశ యువతకు ప్రధాని నరేంద్ర మోదీ భారీ వరాలు ప్రకటించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో కోటి మంది యువతకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాని ఈ ప్రకటనలు చేశారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో యువతే ప్రధాన లబ్ధిదారులు, కీలక భాగస్వాములని మోదీ పేర్కొన్నారు. యువశక్తిని దేశ అభివృద్ధితో అనుసంధానించాలని పిలుపునిచ్చారు.ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో వేగంగా మార్పు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో భారత్ కొత్త టెక్నాలజీల్లో ముందంజలో ఉండాలని మోదీ తెలిపారు. రోబోటిక్స్, ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ, అంతరిక్షం, డేటా సెంటర్ల వంటి రంగాలు భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయను న్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే కోటి మంది యువతకు ఏఐ నైపుణ్య శిక్ష అందించనున్నట్లు ప్రకటించారు. దేశ యువతలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా భారత్‌ను ప్రపంచ స్థాయి ఇన్నోవేషన్ హబ్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఏఐ, రోబోటిక్స్, క్వాంటమ్ టెక్నాలజీ, అంతరిక్ష రంగం, డేటా సెంటర్లు వంటి అభివృద్ధి చెందు తున్న సాంకేతికతల్లో భారత్ నాయకత్వం వహించాలని అన్నారు. యూపీఐ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా - మిగతా 2 లో

## ఎర్రకోటపై తొలిసారి
# 'వందేమాతరం' ఆలాపన




- స్వాతంత్ర్య వేడుకల్లో చారిత్రక ఘట్టం
- 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తొలిసారిగా పూర్తి వందేమాతరం గీతాలాపన
- జాతీయ గీతంతో సమానంగా చట్టపరమైన రక్షణ కల్పిస్తూ కొత్త చట్టానికి ఆమోదం
- వందేమాతరం గీతాన్ని అవమానిస్తే కఠిన చర్యలు, జైలు శిక్ష విధించేలా నిబంధనలు

# బెంగళూరులో ఉగ్ర కుట్ర భగ్నం

- టెక్ కంపెనీ సెక్యూరిటీ గార్డ్ అరెస్ట్!
- బెంగళూరులో ఉగ్రవాద సంబంధాలపై ఓ యువకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- టెక్ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న అసాపుల్ మాలిక్
- తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్‌తో సంబంధాలున్నట్టు వెల్లడి
- ఆఫ్ఘనిస్థాన్ వెళ్లి ఉగ్రసంస్థలో చేరేందుకు సిద్ధమైనట్టు గుర్తింపు
- ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్న పోలీసులు




## 22ఏ పేరుతో
# భారీ దోపిడీ జరుగుతోంది



- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- నిషేధిత భూముల ముసుగులో భారీ దోపిడీ జరుగుతోందన్న బండి సంజయ్
- ఏకంగా 95 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారని ప్రశ్న
- ప్రభుత్వం వేలం వేసిన భూములను కూడా ఈ జాబితాలో చేరుస్తున్నారని విమర్శ

**హైదరాబాద్ :** తెలంగాణలో నిషేధిత భూముల జాబితా (22ఏ) ముసుగులో భారీ దోపిడీ సాగుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో - మిగతా 2 లో



## నల్గొండ నా ఊపిరి
## అభివృద్ధే నా ధ్యేయం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నల్గొండలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కోమటిరెడ్డి
- తన శ్వాస ఉన్నంత వరకు జిల్లా ప్రజల కోసమే పనిచేస్తానన్న మంత్రి
- జిల్లాలో నీటి కష్టాలు తీర్చే బాధ్యతను తాను తీసుకుంటానని వ్యాఖ్య

**హైదరాబాద్ :** నల్గొండ జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపజేసి, తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్గొండ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొని - మిగతా 2 లో

## తెలంగాణను విధ్వంసం నుంచి
# వికాసం వైపు నడిపిస్తున్నాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గోల్కొండలో జాతీయ జెండాను ఎగురవేసిన సీఎం రేవంత్ రెడ్డి
- ఆయుధం లేకుండా అహింసతో స్వాతంత్ర్యం సాధించామని వ్యాఖ్య
- దెబ్బతిన్న వ్యవస్థలను32 నెలల్లో గాడిలో పెట్టామని ప్రకటన
- తెలంగాణ తలసరి ఆదాయం దేశం కంటే 91 శాతం అధికమని వెల్లడి
- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని సీఎం వ్యాఖ్య
- బలమైన ప్రజాస్వామిక భారత్ నిర్మాణానికి పిలుపు



**హైదరాబాద్ :** గోల్కొండ కోటలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం భారత స్వాతంత్ర్య పోరాటమని అన్నారు. అహింసతోనూ విజయాన్ని సాధించవచ్చని మహాత్మాగాంధీ నిరూపించారని చెప్పారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు.స్వాతంత్ర్యం జీవనానికి ఆధారమని, దానికి వెల కట్టలేమని గాంధీజీ చెప్పారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం ద్వారా దేశంలోని వివిధ రంగాల అభివృద్ధికి గత ప్రభుత్వాలు కృషి చేశాయని అన్నారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛను అందించడంతో పాటు విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. తెలంగాణ భవిష్యత్తుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసుకుని ముందుకు - మిగతా 2 లో

# సంపాదకీయం

## సంసిద్ధతే వృద్ధాప్యానికి దీర్ఘాయువు



మెసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (మిట్) 'ఏజ్‌ల్యాబ్' డైరెక్టర్ డాక్టర్ జోసెఫ్ కాఫ్లిన్... వృద్ధాప్యం, దీర్ఘాయువు గురించి ఉన్న అపోహలను పటాపంచలు చేశారు. ఎవరి సహాయమూ లేకుండా స్వతంత్రంగా జీవించడమే అసలైన దీర్ఘాయువు అని అంటున్నారు. మీ దగ్గర ఎంతుందన్నది ముఖ్యం కాదు!వయస్సు పైబడుతున్నప్పుడు డబ్బు ఆదా చేయడం, ఆర్థిక ప్రణాళికలు వేసుకోవటం పైనే ఎక్కువ దృష్టి ఉంటుంది. కానీ మనం ఉండే నివాస స్థలాన్ని బట్టి కూడా సగటు జీవితకాలంలో 9 నుండి 13 సంవత్సరాల తేడా వస్తుంది. నడవడానికి అనుకూలమైన రోడ్లు, నమ్మకమైన రవాణా సదుపాయాలు, తాజా ఆహారం, మంచి మౌలిక సదుపాయాలు కలిగి ఉండటమే మీరు ఎంతకాలం, ఎంత ఆరోగ్యంగా జీవిస్తారో నిర్ణయిస్తాయి తప్ప మీ దగ్గర ఉన్న 'పొదుపు మొత్తం' కాదు. ఒకవేళ మీ చుట్టూ ఉన్న వాతావరణం మిమ్మల్ని ఏకాకిగా మార్చితే, మీ బ్యాంక్ ఖాతాలో ఎంత డబ్బు ఉన్నప్పటికీ మీ శారీరక, మానసిక ఆరోగ్యం వేగంగా క్షీణిస్తుంది.జీవితాన్ని నేను 8,000 రోజుల చొప్పున నాలుగు భాగాలుగా చూస్తాను. 0 నుండి 21 సంవత్సరాలు (నేర్చుకునే దశ); 21 నుండి 46 (కెరీర్, కుటుంబం); 46 నుండి 65 (మధ్యవయసులో మనల్ని మనం కొత్తగా ఆవిష్కరించుకోవడం); 65 నుండి 85 పైన (చివరి దశ). ఈ చివరి దశ అనేది పూర్తి అదనపు 8,000 రోజుల ఒక కొత్త అంకం. కేవలం విహారయాత్రలకు వెళ్లడం, లేదా ఖాళీ గదికి రంగులు వేసుకోవడం లాంటి చిన్న చిన్న పనులు మిమ్మల్ని రెండు దశాబ్దాల పాటు ఉత్సాహంగా ఉంచలేవు. జీవితంలో ఈ కొత్త అధ్యాయం కోసం మీకు ఒక పక్కా ప్రణాళిక అవసరం. ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థికంగా ఎలా ఉండాలో నేర్పించ డానికి సమాజం తరతరాలుగా సమయాన్ని వెచ్చించింది. కానీ ఆ ఖాళీ సమయాన్ని ఎలా గడపాలో నేర్పించడానికి మాత్రం దాదాపు సున్నా సమయాన్ని కేటాయించింది.ఫైనాన్షియల్ ప్లానర్లు మీరు వైద్య ఖర్చులను భరించ గలరా అని అడుగుతారు; కానీ నేను చాలా సరళంగా అనిపించే ఒక ప్రశ్న అడుగుతాను. ఒక వేడి వేసవి రాత్రి మీకు ఐస్‌క్రీమ్ తినాలనిపిస్తే, మీరు దాన్ని ఎలా వెళ్లి తెచ్చుకుంటారు? ఉదాహరణకు 50 ఏళ్లు పైబడిన అమె రికన్లలో 70 శాతం కంటే ఎక్కువ మంది నగర శివారు లేదా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అంటే స్వేచ్ఛగా ఎక్కడికైనా వెళ్లే శక్తిని పూర్తిగా కోల్పోవడమే. నిజమైన స్వేచ్ఛ అంటే కేవలం జీవించి ఉండటం కాదు; వేరొకరిని లిఫ్ట్ అడగాల్సిన అవసరం లేకుండా, మీకు అనిపించిన వెంటనే చిన్న చిన్న ఆనందాలను పొంద గలిగే రవాణా సౌకర్యాలు ఉండటం. ఒక చిన్న ప్రయాణం కోసం మీరు కొన్ని రోజుల ముందే ప్లాన్ చేసుకోవాల్సి వచ్చినా, లేదా బిజీగా ఉండే మీ పిల్లలపై పూర్తిగా ఆధారపడాల్సి వచ్చినా... మీరు ఇప్పటికే మీ స్వేచ్ఛను పోగొట్టుకున్నట్లే.రిటైర్మెంట్ తర్వాత గార్డెనింగ్ చేస్తాననీ లేదా గోల్ఫ్ ఆడతాననీ పరిచయస్తులు తరచూ నాతో చెబుతుంటారు. కానీ మానవ సంబంధాలు లేకుండా ఒంటరిగా కల్పించుకునే హాబీలు త్వరగా విసుగు తెప్పిస్తాయని కోవిడ్--19 లాక్‌డౌన్లు నిరూపించాయి. మీకు కేవలం ఆర్థిక ప్రణాళికలు ఉంటే సరిపోదు. ఒక మామూలు మంగళవారం ఉదయం 10:30 గంటలకు మిమ్మల్ని కలిసి లంచ్ చేయడానికి సిద్ధంగా ఉండే మనుషులతో కూడిన ఒక యాక్టివ్ 'సామాజిక పోర్ట్‌ఫోలియో' కూడా మీకు అవసరం. మీరు ఉద్యోగానికి దూరమైనప్పుడు, ప్రతిరోజూ లభించే సాధారణ సామాజిక సంబంధా లను, ఒక దినచర్యను కోల్పోతారు. మీరు వేర్వేరు తరాల ప్రజలతో ఉద్దేశపూర్వకంగా సంబంధాలను పెంచుకోకపోతే; మీకు నలుగురితో సంభాషణలు, సామాజిక భాగస్వామ్యం లేకపోతే, అత్యంత అవస రమైన సమయంలోనే మీ సామాజిక ప్రపంచం కుంచించుకుపోయి ఉంటుంది.

## ప్రజాస్వామ్య విలువలకు పునరంకితం కావాలి

**మొదటిపేజీ తరువాయి -** తన సందేశాన్ని పంచుకున్నారు. దేశ నిర్మాణానికి మూలస్తంభాలైన ప్రజాస్వామ్య సూత్రాలకు మనమందరం పునరంకితం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు."ఈ 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేళ, మన గొప్ప దేశాన్ని నిర్మిస్తున్న ప్రజాస్వామ్య విలువలకు మనల్ని మనం పునరంకితం చేసుకుందాం. స్వాతంత్ర్య సమరయోధుల పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని, ఉజ్వలమైన, సమ్మిళితమైన, సుసంపన్నమైన భారతదేశం కోసం మనమందరం కృషి చేయాలి" అని జగన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, దేశ భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు. 'జై హింద్' అంటూ తన సందేశాన్ని ముగించారు.

## 22ఏ పేరుతో భారీ దోపిడీ జరుగుతోంది

**మొదటిపేజీ తరువాయి -** నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనల మధ్య ఎలాంటి తేడా లేదని మండిపడ్డారు.రాష్ట్రంలో ఉన్న 2.77 కోట్ల ఎకరాల్లో ఏకంగా 95 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారని బండి సంజయ్ నిలదీశారు. ప్రజలు కష్టపడి కొనుక్కున్న స్థలాలు, పరిశ్రమలకు కేటాయించిన భూములు, ప్రభుత్వమే వేలం వేసిన భూములను కూడా ఈ జాబితాలో చేర్చి వేధిస్తున్నారని విమర్శించారు. విద్యాసంస్థల ఫీజు రీయింబర్స్ మెంట్ పాత బకాయిలను ఇంకా చెల్లించకుండా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్వాన్స్ ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. జెన్-జీ యువతకు స్థానం కల్పిస్తామనే కాంగ్రెస్ మాటలు నిజమైతే... వెంటనే యువకులకు మంత్రి పదవులు, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని సవాల్ విసిరారు.

## నల్గొండ నా ఊపిరి.. అభివృద్ధే నా ధ్యేయం



**మొదటిపేజీ తరువాయి -** జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.తెలంగాణ సాయుధ పోరాటంలో నల్గొండ నేల చూపిన త్యాగం, ఆత్మగౌరవం స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీకలని అభివర్ణించారు. తన శ్వాస ఉన్నంత వరకు జిల్లా ప్రజల ఆశలు, ఆకాంక్షల కోసమే పనిచేస్తానని చెప్పారు. జిల్లాలో సాగు, తాగునీటి కష్టాలను శాశ్వతంగా తీర్చే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమానికి పెద్దపీట వేస్తూ 5.35 లక్షల మంది రైతులకు రూ. 715 కోట్ల రైతు భరోసా, 1.99 లక్షల మంది పింఛనుదారులకు రూ. 51.28 కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 17,873 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి 4,360 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని, 2.56 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు.నల్గొండ పట్టణంలో 24 గంటల మంచినీటి సరఫరా లక్ష్యంతో రూ. 83 కోట్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడమే కాకుండా, పట్టణాభివృద్ధి కోసం మరో రూ. 300 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు రూ. 20 కోట్లతో ఎన్ఏసీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అమరవీరుల త్యాగాల సాక్షిగా నల్గొండ జిల్లాను అన్ని రంగాల్లోనూ ప్రథమ స్థానంలో నిలబెడతానని హామీ ఇచ్చారు.

# దేశవ్యాప్తంగా కోటి మంది యువతకు ఏఐ శిక్షణ



**మొదటిపేజీ తరువాయి -** ఇప్పటికే భారత్ తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందని గుర్తుచేశారు. ఇక తదుపరి తరం కమ్యూనికేషన్ టెక్నాలజీలోనూ ముందడుగు వేయాల్సిన సమయం వచ్చిందన్నారు.తమ పిల్లలను కోచింగ్ క్లాసులకు పంపకపోతే కుటుంబానికి గౌరవం ఉండదనే భావన తల్లిదండ్రుల్లో నెలకొందని ప్రధాని వ్యాఖ్యానించారు. అయితే ఇక అలాంటి పరిస్థితి అవసరం లేదని అన్నారు. కోచింగ్ కోసం కుటుం బాలు ఖర్చు చేస్తున్న వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. అదే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు మరింత దగ్గరగా ఉండి వారి చదువు, భవిష్యత్తుపై శ్రద్ధ పెట్టవచ్చని పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, నిపుణుల సేవలను ఒకే వేదికపైకి తీసుకొస్తామని తెలిపారు. వీటి సమన్వయంతో యువతకు వివిధ పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించే సంపూర్ణ ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీని ద్వారా ఖరీదైన కోచింగ్ సంస్థలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని భావిస్తున్నారు.గత దశాబ్ద కాలంలో దేశ విద్యారంగంలో చోటుచేసుకున్న మార్పులను ప్రధాని వివరించారు. 2014 తర్వాత 650 కొత్త యూనివర్సిటీలు దేశంలో ఏర్పడ్డాయని చెప్పారు. 2004-2014 మధ్యకాలంలో దేశంలో 350 కంటే తక్కువ యూనివర్సిటీలు ఉండగా, ఆ తర్వాత 10-12 ఏళ్లలోనే దాదాపు 650 కొత్త విశ్వవిద్యాలయాలు వచ్చాయని మోదీ పేర్కొన్నారు. ఇక వైద్య సీట్లు భారీగా పెరిగాయని తెలిపారు. 2014కు ముందు దేశంలో ఉన్న వైద్య విద్య సీట్ల సంఖ్యతో పోలిస్తే ప్రస్తుతం రెట్టింపుకుపైగా సీట్లు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. వైద్య విద్యకు సంబంధించి దేశంలో అవకాశాలను విస్తరిం చడంతో ఎక్కువ మంది విద్యార్థులకు వైద్య విద్య అభ్యసించే అవకా శం లభిస్తోందని మోదీ పేర్కొన్నారు. దేశంలో దశాబ్దాల తర్వాత కొత్త విద్యా విధానాన్ని తీసుకొచ్చామని ప్రధాని మోదీ అన్నారు. సుమారు 35 ఏళ్ల పాటు కొత్త విద్యా విధానం లేకపోయిందని, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానంను తీసుకొచ్చిందని చెప్పారు. విద్యార్థుల అవసరాలు, మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దే దిశగా ఈ విధానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భారత్ ఇప్పుడు విదేశీ యూనివర్సిటీలకు కూడా ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారు తోందని మోదీ అన్నారు. విదేశీ విశ్వవిద్యాల యాలు భారత్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అవకాశాలు కల్పిస్తు న్నామని తెలిపారు. అంతేకాకుండా భారతీయ విద్యార్థులు దేశం విడిచి వెళ్లకుండానే విదేశీ యూనివర్సిటీల డిగ్రీలు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

# ఏటా డీఎస్సీ, యువతకు 20 లక్షల ఉద్యోగాలు

**మొదటిపేజీ తరువాయి -**
'పీ4' కార్యక్రమాన్ని ప్రారంభించామని, తద్వారా ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం కృషి చేస్తున్నామని వివరించారు.నవ్యాంధ్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ఉద్ఘాటించిన సీఎం, వారికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. అధికారంలోకి రాగానే తొలి సంతకంతో 15,941 ఉపాధ్యాయ పోస్టులతో 'మెగా డీఎస్సీ 2025'ను పారదర్శకంగా పూర్తి చేశామని గుర్తుచేశారు. ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ఈ వేదిక నుంచి హామీ ఇచ్చారు. ఈ ఏడాది 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశామన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే రూ.24 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా 11 లక్షల ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ వంటి ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు.రైతన్న సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నమ్మే తమ ప్రభుత్వం, అన్నదాతలకు అండగా నిలుస్తోందని సీఎం అన్నారు. 'పీఎం-కిసాన్--అన్నదాత సుఖీభవ' కింద రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తున్నామని, ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని ప్రకటించారు. సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించామని, రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో తీవ్రంగా నష్టపోయిన పోలవరం ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించామని చంద్రబాబు అన్నారు. రెండేళ్లలో 89 శాతం పనులు పూర్తి చేశామని, వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. ఐదున్నర కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. రైతుల త్యాగంతో నిర్మిస్తున్న ఈ రాజధానిలో ప్రస్తుతం రూ.50 వేల కోట్ల విలువైన పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు.ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, రెవెన్యూ సంస్కరణల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని సీఎం చెప్పారు. అవినీతి రహిత పాలన కోసం టెక్నాలజీని వినియోగిస్తున్నామని, 'మనమిత్ర' వాట్సాప్ ద్వారా 1100కు పైగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని, విద్యుత్ రంగంలో సంస్కరణలతో ఛార్జీలు పెంచకుండానే ప్రజలపై భారం తగ్గించామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని, గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని హెచ్చరించారు. అందరి కృషితో వికసిత భారత్ నిర్మాణంలో భాగమవుతూ, స్వర్ణాంధ్రను సాధిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# మనం అడ్రస్ లేనివాళ్లం కాదు మన కేరాఫ్ అడ్రస్ అమరావతి



**మొదటిపేజీ తరువాయి -** ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని మరోసారి స్పష్టం చేశారు. "ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. మనం అడ్రస్ లేని వాళ్లం కాదు.. మన కేరాఫ్ అడ్రస్ అమరావతి" అని ఆయన పునరుద్ఘాటించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.విద్యా వ్యవస్థలో తాము చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని గర్వంగా ప్రకటించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్లు, డొక్కా సీతమ్మ గారి పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో రాజకీయాలకు తావు లేకుండా చేశామని, పాఠ్యపుస్తకాలపై కానీ, పాఠశాలల వద్ద కానీ ఎక్కడా ముఖ్యమంత్రి లేదా తన ఫోటోలు ఉండవని స్పష్టం చేశారు. చరిత్రలో తొలిసారిగా, పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫోటోలతో ప్రకటనలు ఇచ్చామని గుర్తుచేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును సలహాదారుగా నియమించినట్లు వెల్లడించారు. లక్షలాది మంది త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని లోకేశ్ అన్నారు. మహాత్మా గాంధీ, నేతాజీ సుభాశ్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను ఎగురవేయడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. తన తాత, స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరు మీద ఉన్న జిల్లాలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనడం అరుదైన గౌరవమని తన వ్యక్తిగత ఆనందాన్ని పంచుకున్నారు. విజయవాడ నగరం విద్య, కళలకు నిజమైన రాజధాని అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎర్రకోటపై తొలిసారి 'వందేమాతరం' ఆలాపన

**మొదటిపేజీ తరువాయి -**
భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఒక చారిత్రక, అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. దేశ చరిత్రలో తొలిసారిగా ఎర్రకోటపై జరిగిన అధికారిక వేడుకల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పూర్తి గీతాన్ని ఆలపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో, ఆర్మీ బ్యాండ్ వందేమాతరం గీతాన్ని వాయించగా, ఆ తర్వాత యథావిధిగా జాతీయ గీతం 'జన గణ మన'ను ఆలపించారు. ఈ ఏడాది జాతీయ గేయానికి 150 ఏళ్లు పూర్తి కావడం ఈ సందర్భానికి మరింత ప్రాధాన్యాన్ని చేకూర్చింది.ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట బురుజుల నుంచి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన వెంటనే, 1721 ఫీల్డ్ బ్యాటరీ (సెరిమోనియల్) ఆధ్వర్యంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్‌తో 21 సార్లు గన్ సెల్యూట్ చేశారు. ఆ తర్వాత ఆర్మీ బ్యాండ్ 'వందేమాతరం' గీతాన్ని వాయించింది. అదే సమయంలో భారత వైమానిక దళానికి చెందిన రెండు ఎంఐ-17 హెలికాప్టర్లు వేదికపై పూలవర్షం కురిపించాయి. ఒక హెలికాప్టర్‌పై త్రివర్ణ పతాకం ఉండగా, మరో హెలికాప్టర్‌పై 'వందేమాతరం' అని రాసి ఉన్న పతాకం ఎగరడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎర్రకోటపై వందేమాతరం గీతాన్ని వాయించడం ఇదే తొలిసారి" అని ప్రధాని మోదీ తన ప్రసంగంలో స్పష్టం చేశారు.ఇటీవల జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. 'జాతీయ గౌరవ అవమానాల నివారణ (సవరణ) బిల్లు-2026'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొద్ది రోజుల క్రితం ఆమోదముద్ర వేశారు. ఈ కొత్త చట్టం ప్రకారం వందేమాతరం గీతాలాపనను ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నా లేదా అవమానించినా జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు జాతినుద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ముందు, తర్వాత కూడా వందేమాతరం పూర్తి గీతాన్ని ప్రసారం చేయడం గమనార్హం. "స్వదేశీ ఉద్యమ సమయంలో వందేమాతరం గీతం ప్రజల పాటగా మారింది" అని రాష్ట్రపతి తన ప్రసంగంలో గుర్తుచేశారు. ఈ కొత్త చట్టంతో జాతీయ గేయానికి జాతీయ గీతంతో సమానమైన గౌరవం, రక్షణ లభించినట్లయింది.

# తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం



**మొదటిపేజీ తరువాయి -** సాగుతున్నామని వెల్లడించారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32 నెలలు పూర్తయ్యాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న వ్యవస్థలను ఒక్కొక్కటిగా గాడిలో పెడుతున్నామని చెప్పారు. తమ సంక్షేమ పథకాలను కేవలం ఆర్థిక లెక్కలతో చూడటం లేదని స్పష్టం చేశారు. సంక్షేమంలో మానవీయత ఉందని, పేదల పట్ల బాధ్యత ఉందని అన్నారు. వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న తపనతో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఓట్ల కోసం లేదా మొక్కుబడిగా సంక్షేమాన్ని అమలు చేయడం లేదని స్పష్టం చేశారు.32 నెలల్లో ప్రభుత్వం చేసిన కృషి ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తలసరి ఆదాయం పెరగడం దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 91 శాతం అధికంగా ఉందని చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నది తమ ప్రభుత్వ నమ్మకమని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాలని, పరస్పర గౌరవం, దేశభక్తి విలువలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని, శాంతి, సౌభ్రాతృత్వాలతో కూడిన బలమైన ప్రజాస్వామిక భారతదేశాన్ని నిర్మించడమే సమరయోధులకు నిజమైన నివాళి అని అన్నారు. ప్రతి పౌరుడికి సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అందేలా నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కర్తవ్యనిష్ఠతో, అంకితభావంతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# బెంగళూరులో ఉగ్ర కుట్ర భగ్నం



**మొదటిపేజీ తరువాయి -** బెంగళూరులో భారీ ఉగ్ర కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్‌కు చెందిన అసాఫుల్ మాలిక్ అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని జిగాని ప్రాంతంలో ఉన్న ఒక ప్రముఖ టెక్ కంపెనీలో అతను గత ఏడాది కాలంగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు.బొమ్మసంద్ర ఇండస్ట్రియల్ ఏరియా పోలీసులు సాధారణ పెట్రోలింగ్‌లో భాగంగా ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో మాలిక్ కదలికలు అనుమానాస్పదంగా కనిపించడంతో శుక్రవారం అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.అఫ్ఘనిస్థాన్‌లోని తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) హ్యాండ్లర్‌తో మాలిక్ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. త్వరలోనే అఫ్ఘనిస్థాన్‌కు వెళ్లి ఆ ఉగ్రవాద సంస్థలో చేరేందుకు అతను సిద్ధమవుతున్నట్లు వెల్లడైంది. భారత్, పాకిస్థాన్‌లలో దాడులు చేసేందుకు ప్రణాళికలు రచించడంపై వీరి మధ్య చర్చలు జరిగినట్లు అధికారులు తెలిపారు.ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి పాకిస్థానీ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ తాజా పరిణామంతో బెంగళూరులో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.

# ఎఫ్ఆర్ హైస్కూల్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు







- జాతీయ జెండా ఆవిష్కరించిన తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, సీఐ వేణుగోపాల్
- ప్రభుత్వ 'షైనింగ్ స్టార్' అవార్డు గ్రహీత శివమల్లికకు పాఠశాల సిబ్బంది సన్మానం
- సామాజిక శాస్త్రంలో మండల టాపర్ వెంకట సింధుజకు పతకం, మెమెంటో అందజేత

**దేవనకొండ, ఆగస్టు 15 (స్ఫూర్తి పత్రిక):** దేవనకొండ మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ రూరల్ హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, సీఐ వేణుగోపాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రముఖుల సమక్షంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు.కార్యక్రమానికి మండల విద్యాధికారి ఎస్. ఉస్మాన్ భాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ఉచ్చీరప్ప తెలిపారు.

### ప్రభుత్వ 'షైనింగ్ స్టార్' అవార్డు గ్రహీతకు పాఠశాల సత్కారం

ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఓసీ కేటగిరీలో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని శివమల్లికకు ప్రభుత్వం 'షైనింగ్ స్టార్' అవార్డును అందజేసింది. ప్రభుత్వ స్థాయిలో ఇప్పటికే అవార్డు అందుకున్న శివమల్లికను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ రూరల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఉచ్చీరప్ప, ఉపాధ్యాయ సిబ్బంది మరోసారి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శివమల్లికకు పతకం, మెమెంటో అందజేసి ఆమె ప్రతిభను అభినందించారు. ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన విద్యార్థిని తమ పాఠశాల విద్యార్థి కావడం గర్వకారణమని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు.

### సామాజిక శాస్త్రంలో మండల టాపర్‌కు అభినందనలు

అదేవిధంగా పదో తరగతి పరీక్షల్లో సామాజిక శాస్త్రం సబ్జెక్టులో అత్యుత్తమ మార్కులు సాధించి మండల స్థాయిలో టాపర్‌గా నిలిచిన రవీంద్ర రెడ్డి, రాజేశ్వరి దంపతుల కుమార్తె వెంకట సింధుజను కూడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆమెకు పతకం, మెమెంటో అందజేసి అభినందనలు తెలిపారు.విద్యార్థులు సాధించిన విజయాలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. చదువుతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో దేవనకొండ సింగిల్ విండో అధ్యక్షుడు రాజశేఖర్, శాంతికుమార్, బంక షేకన్న, సదాశివరావు, రాజగోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కప్పట్రాళ్లలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





- జాతీయ జెండా ఆవిష్కరించిన వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ
- విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి
- స్వాతంత్ర్య సమరయోధు త్యాగాలను స్మరించుకున్న చైర్మన్

**దేవనకొండ, ఆగస్టు 15 (స్ఫూర్తి పత్రిక):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి కప్పట్రాళ్ల బొజ్జమ్మ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవిస్తున్నారని పేర్కొన్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్యత్తని, నేటి విద్యార్థులు రేపటి బాధ్యతాయుత పౌరులుగా తయారై దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.స్వాతంత్ర్య స్ఫూర్తితో దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ ప్రతి ఒక్కరూ అభివృద్ధి కోసం కలిసి ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు

# రెయిన్బో ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండా ఆవిష్కరణ.. దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు
- స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్న విద్యార్థులు



**దేవనకొండ, ఆగస్టు 15 (స్ఫూర్తి పత్రిక):** దేవనకొండ మండల కేంద్రంలోని రెయిన్బో ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను విద్యార్థులకు వివరిస్తూ, వారి సేవలను స్మరించుకున్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి, నైతిక విలువలను అలవర్చుకుని విద్యలో ఉన్నతంగా రాణించాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని, విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా ఎదిగి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థుల్లో దేశభక్తి భావాలను పెంపొందించేలా పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- సీపీఐ కార్యాలయం వద్ద జాతీయ పతాకావిష్కరణ
- ప్రజాసంఘాల నాయకుల సమక్షంలో ప్రతిజ్ఞ



**దేవనకొండ, ఆగస్టు 15 (స్ఫూర్తి పత్రిక):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవనకొండలోని సీపీఐ కార్యాలయం వద్ద శనివారం జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. మద్దిలేటి శెట్టి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ, ప్రజా సంఘాల నాయకుల సమక్షంలో స్వాతంత్ర్య దినోత్సవ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. దేశ ఐక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం. నరసరావు, రైతు సంఘం మండల గౌరవ అధ్యక్షులు కందప్ప, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు శేఖర్, రాజశేఖర్, కృష్ణ, ప్రసాద్, భాస్కర్, రామాంజి, కోదండ, శ్రీనివాసులు, గంగన్న, గోపాల్, మునిస్వామి, రాజు, మద్దిలేటి, వీరస్వామి, నాగేంద్ర, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసిన సోదరులు



**కడప జిల్లా సుండుపల్లి (స్ఫూర్తి పత్రిక): ఆగస్టు 15 :** సుండుపల్లి మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని త్రివర్ణ పతాకాన్ని టిడిపి నాయకులు చప్పిడి మహేష్ నాయుడు, మండల అధ్యక్షుడు చప్పిడి రమేష్ నాయుడు ,ఎంపీపీ రాజమ్మ ఎగరవేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజు మనము స్వేచ్ఛగా తిరుగుతున్నాం, మాట్లాడుతున్నాం, జీవిస్తున్నామంటే ఎందరో మహాత్ముల త్యాగ ఫలితమేనని వారు ఎంతగానో శ్రమించి పోరాడి స్వాతంత్రాన్ని మన దేశానికి తెచ్చి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, జనసేన నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రజ్యోతి విలేకరి పరమేష్‌ను ఎమ్మెల్యే బీవీ పరామర్శ



**ఎమ్మిగనూరు (స్ఫూర్తి పత్రిక):ఆగస్టు 15:**పట్టణంలోని ఆంధ్రజ్యోతి విలేకరి జి.పరమేష్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా పరమేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్య నివేదికలను పరిశీలించారు.త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లోకి రావాలని ఆకాంక్షిస్తూ త్వరితగతిన కోలుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి,వారి పరిస్థితిని తెలుసుకుని అండగా ఉంటామని,అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ కర్నూలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్,ఏఎంసీ చైర్మన్,పట్టణ అధ్యక్షులు మరియు కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు,ఈనాడు విలేకరులు, ఎబిన్ విలేకరులు,సహ విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి :షరాఫ్ అసోసియేషన్



**ఎమ్మిగనూరు (స్ఫూర్తి పత్రిక): ఆగస్టు15:**పట్టణంలో షరాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 80 స్వతంత్ర దినోత్సవం జెండా ఆవిష్కరణ చేసి స్వతంత్ర దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో షరాఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలి బాషా, సెక్రెటరీ ఖాదర్ బేగ్,లలిత్ షా,యూకే మోహన్,పాల వెంకటేష్, శేషయ్య,యూకే సురేష్ లు పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని,ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టవచ్చని తెలిపారు.అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండటం చాలా ముఖ్యం.ప్రాణాలను రక్షించే ఈ మహత్తర కార్యంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ మా ధన్యవాదాలు అని అన్నారు.

## కడపలో టాటా ఈవీ మెగా చార్జర్ హబ్ ప్రారంభం




**కడప (స్ఫూర్తి పత్రిక): ఆగస్టు 15 : క్రైమ్ :** కడపలోని రిట్రీట్ రెస్టోలో టాటా పవర్, టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ (టీపీఈఎం) సంయుక్తంగా కొత్త టాటా ఈవీ కో-బ్రాండెడ్ మెగా చార్జర్ హబ్‌ను ప్రారంభించాయి. దక్షిణ భారత దేశంలో ప్రధాన రహదారుల వెంబడి ఈవీ చార్జింగ్ సదుపాయాలను మెరుగు పరచడంలో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు. బెంగళూరు-కడప హైవేలో ఉన్న ఈ చార్జర్, తిరుపతి, అనంతపురం, బెంగళూరు, రాయలసీమలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణించే ఈవీ వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.ఈ చార్జింగ్ కేంద్రంలో మొత్తం 180 కిలోవాట్ల సామర్థ్యం ఉంది. ఇందులో ఒక 120 కిలోవాట్ల డీసీ అల్ట్రా-ఫాస్ట్ చార్జర్, ఒక 60 కిలోవాట్ల డీసీ ఫాస్ట్ చార్జర్ అందుబాటులో ఉన్నాయి. ఒకేసారి నాలుగు వాహనాలు పార్క్ చేసి సులభంగా చార్జింగ్ చేసుకునే సదుపాయం ఇక్కడ కల్పించారు. మహానగరాలకే పరిమితం కాకుండా ప్రాంతీయ పట్టణాల్లోనూ ఈవీ వినియోగాన్ని ప్రోత్సహించడానికి, సుదూర ప్రయాణాలు చేసేవారికి నమ్మకాన్ని కల్పించడానికి ఈ చార్జింగ్ స్టేషన్ ఎంతగానో దోహదపడుతుంది.ప్రస్తుతం టాటా పవర్ దేశవ్యాప్తంగా 690కి పైగా నగరాల్లో 6700కు పైగా పబ్లిక్ చార్జింగ్ పాయింట్లు, 2 లక్షలకు పైగా హోమ్ చార్జర్లతో అతిపెద్ద నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ఈ మౌలిక సదుపాయాలను 2030 నాటికి 10,000 పబ్లిక్ చార్జింగ్ పాయింట్లు, 7.5 లక్షల హోమ్ చార్జర్లకు విస్తరించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న 800కు పైగా టాటా ఈవీ మెగా చార్జింగ్ పాయింట్ల నెట్‌వర్క్‌లో ఇది కూడా ఒక భాగం కాగా, ఈ హబ్‌లను టాటా పవర్ ఈజెడ్ చార్జ్ యాప్ ద్వారా సులభంగా ఉపయోగించుకోవచ్చు.

## జిల్లా స్థాయిలో ఉత్తమ అధికారులుగా ఎంపికైన అధికారులు

**తుగ్గలి, ఆగస్టు 15 (స్ఫూర్తి పత్రిక)::** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తుగ్గలి మండలానికి చెందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు జిల్లా స్థాయిలో ఉత్తమ అధికారులుగా ఎంపికయ్యారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించినందుకు వీరిని జిల్లా స్థాయి పురస్కారాలకు ఎంపిక చేశారు.జొన్నగిరి పశువైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ, ఆర్అండ్‌బీ ఏఈ ఎం. సునీల్, డిప్యూటీ తహసీల్దార్ సుదర్శనం, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం బుట్ట రోజారాణి, వీఆర్వో రాజేశ్వరి, తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఫార్మసిస్ట్ రమేష్, ఉపాధి హామీ క్లస్టర్ టీఏ ఎంకప్ప ఉత్తమ అధికారులుగా ఎంపికయ్యారు.ఈ సందర్భంగా శనివారం కర్నూలులో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్, మంత్రుల చేతుల మీదుగా ఎంపికైన ఉద్యోగులు పురస్కారాలు అందుకున్నారు. ప్రభుత్వ సేవల్లో అంకితభావంతో పనిచేసినందుకు తమ సేవలను గుర్తించి అవార్డులకు ఎంపిక చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.ఉత్తమ అధికారులుగా ఎంపికైన తుగ్గలి మండలానికి చెందిన ఉద్యోగులను మండలంలోని పలువురు అధికారులు, ప్రజలు, మిత్రులు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## వినాయక చవితి వేడుకలపై గణేష్ ఉత్సవ కమిటీ ముందస్తు కార్యాచరణ.



**డోన్ (స్ఫూర్తి పత్రిక): ఆగస్టు 15 :** డోన్ పట్టణంలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులంతా కలిసి స్థానిక వినాయకుని గుడి నందు స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రథమ పూజ అధ్యక్షులు కోట్రికే పనిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సందు వెంకట రమణ, హనుమంత రెడ్డి ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమం అనంతరం, రాబోయే వినాయక చవితి ఉత్సవాలను పట్టణంలో అత్యంత వైభవంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ప్రత్యేకంగా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. వినాయక చవితి మొదటి రోజు విగ్రహాల ప్రతిష్ఠాపన నుండి, 5వ రోజున జరిగే శోభాయాత్ర, నిమజ్జనం వరకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై కమిటీ ఒక స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ సందర్భంగా వారు మొదటి రోజు నుండి వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసే గణేష్ మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం. ఉత్సవాల ఐదు రోజులు మండపాల దగ్గరకు వచ్చే భక్తుల కోసం తగు సూచనలు. 5వ రోజున నిర్వహించే వినాయక నిమజ్జన శోభాయాత్రను ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడం. నిమజ్జన ఘాట్ల దగ్గర తగిన జాగ్రత్తలు, క్రేన్ల ఏర్పాటుపై చర్చించడం జరిగింది. పట్టణ ప్రజలు, భక్తులు, మరియు యువత అంతా కలిసికట్టుగా ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని డోన్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తిమ్మారెడ్డి, శివశంకర్ రెడ్డి, బచ్చు చక్రి, ఈశ్వర్ నాయుడు, రవికుమార్, రామకృష్ణ, ఆంధ్రప్రభ విలేకరి ప్రవీణ్, గాజుల ఉషారాణి, నాయుడు పాల్గొన్నారు.

## 19న మార్కెట్లోకి హానర్ 200 లైట్ 5జీ ఇవీ స్పెషిఫికేషన్స్



ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ హానర్ తన హానర్ 200 లైట్ 5జీ ఫోన్ ను ఈ నెల 19న భారత్ మార్కెట్లో ఆవిష్కరించనున్నది. ఇప్పటికే గత జూన్ నెలలో గ్లోబల్ మార్కెట్లలో ఈ ఫోన్ ఆవిష్కరించారు. జూలైలో భారత్ మార్కెట్లో ఆవిష్కరించిన హానర్ 200 5జీ, హానర్ 200 ప్రో 5జీ ఫోన్లతో జత కలువనున్నది. అమెజాన్ ద్వారా హానర్ 200 లైట్ 5జీ ఫోన్ల విక్రయాలు జరుగుతాయి.హానర్ 200 లైట్ 5జీ ఫోన్ ఫుల్ హెచ్డీం అమోలెడ్ డిస్ ప్లే, 2000 నిట్స్ పీక్ బ్రైట్ నెస్, 1200 నిట్స్ హై బ్రైట్ నెస్ మోడ్ కలిగి ఉంటుంది. ఈ-బుక్, డార్క్ మోడ్ లకు స్క్రీన్ మద్దతుగా ఉంటుంది. 8జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ గా వస్తున్న ఈ ఫోన్ లో ర్యామ్ వర్చువల్ గా అదనంగా 8 జీబీ పెంచుకోవచ్చు. సియాన్ లేక్, మిడ్ నైట్ బ్లాక్, స్టారీ బ్లూ కలర్ ఆప్షన్లలో ఈ ఫోన్ లభిస్తుంది. 108 మెగా పిక్సెల్ ప్రైమరీ సెన్సర్ రేర్ కెమెరా, 5 మెగా పిక్సెల్ డెప్త్ షూటర్, 2 మెగా పిక్సెల్ మైక్రో షూటర్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 50-మెగా పిక్సెల్ వైడ్ యాంగిల్ కెమరా ఉంటాయి.హానర్ 200 లైట్ 5జీ ఫోన్ ఆండ్రాయిడ్ 14 బేస్డ్ మ్యాజిక్ ఓఎస్ 8 వర్షన్ పై పని చేస్తుందీ ఫోన్. హానర్ 200 లైట్ 5జీ ఫోన్ 8 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ ధర సుమారు రూ.29,900 (279.99 గ్రేట్ బ్రిటన్ పౌండ్లు) పలుకుతుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 6080 ఎస్వోసీ ప్రాసెసర్, 35వాట్ల వైర్డ్ సూపర్ చార్జర్ మద్దతుతో 4500 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. 6.7 అంగుళాల స్క్రీన్, సెక్యూరిటీ కోసం సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్ కలిగి ఉంటుంది.

## కదం తొక్కుతున్న మార్కెట్లు




**తొలిసారి 83 వేలపైన సెన్సెక్స్**

**చారిత్రక గరిష్ఠ స్థాయికి సూచీలు**

దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న సెన్సెక్స్ మంగళవారం 83 వేల మైలురాయిని అధిగమించింది. మార్కెట్ చరిత్రలో ఇంతటిస్థాయికి చేరుకోవడం ఇదేతొలిసారి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల పవనాలకు తోడు వడ్డీరేట్ల తగ్గింపునకు అమెరికా ఫెడరల్ మొగ్గుచూపే అవకాశం ఉన్నట్లు వచ్చిన సంకేతాలు మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. నష్టాల్లో ప్రారంభమైన సూచీలకు గ్లోబల్ మార్కెట్లు భారీగా లాభపడటంతో దేశీయ సూచీలు ఎగిశాయి. ఇంట్రాడేలో 160 పాయింట్లకు పైగా లాభపడి 83,152.41 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 90.88 పాయింట్లు అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 83,079.66 వద్ద ముగిసింది.మరో సూచీ నిఫ్టీ సైతం లైఫ్‌టైం హై 25,400 పాయింట్ల పైన ముగిసింది. చివరకు 34.80 పాయింట్లు ఎగబాకి 25,418.55 వద్ద స్థిరపడింది. స్టాక్ మార్కెట్లు పాజిటివ్‌లోనే కదలాడుతున్నాయని, ఫెడ్ వడ్డీరేట్లను పావుశాతం తగ్గించే అవకాశాలుండటం సూచీల్లో జోష్ పెంచిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. అలాగే కూరగాయల ధరలు శాంతించడంతో ఆగస్టు నెలకుగాను టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోవడం కూడా కలిసొచ్చిందన్నారు.

## ట్రయంఫ్ సరికొత్త బైకులు

**ధరల శ్రేణి రూ.2.17-2.40 లక్షలు**




ప్రముఖ వాహన సంస్థ బజాజ్ ఆటో..ప్రీమియం మోటార్‌సైకిళ్ల బ్రాండ్ ట్రయంఫ్‌ను మరింత బలోపేతం చేయడానికి మరో రెండు మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 400 సీసీ సెగ్మెంట్‌లో విడుదల చేసిన స్పీడ్ టీ4 మాడల్ ధర రూ.2.17 లక్షలుగాను, మై25 స్పీడ్ 400 మాడల్ ధర రూ.2.40 లక్షలుగా నిర్ణయించింది.ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ట్కస్టైలిష్, పనితీరు, టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన సంస్థ..యువతను దృష్టిలో పెట్టుకొని ఈ బైకు వేగాన్ని మరింత పెంచినట్లు బజాజ్ ఆటో ప్రెసిడెంట్ ఉనిత్ సుమీత్ నారంగ్ తెలిపారు. ట్రయంఫ్ బ్రాండ్‌ను మరింత బలోపేతం చేయడానికి డీలర్ల సంఖ్యను ఈ ఏడాది చివరినాటికి 170కి, అలాగే వచ్చే ఏడాది 200కి పెంచుకోనున్నట్లు ఆయన ప్రకటించారు.బ్రిటన్‌కు చెందిన మోటార్‌సైకిల్ బ్రాండ్ ట్రయంఫ్‌తో గతేడాది జతకట్టిన విషయం తెలిసిందే. చిన్న స్థాయి నగరాలు, పట్టణాల్లో కూడా డీలర్లను నెలకొల్పనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం 75 నగరాల్లో 120 డీలర్లు ఉన్నారు.

## వే2న్యూస్ 117 కోట్ల సేకరణ

way2news
#IndiaReadsWay2News

ప్రాంతీయ వార్తలు అందించే వే2న్యూస్ మరోసారి భారీ స్థాయిలో నిధులను సమీకరించింది. వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్ నుంచి 14 మిలియన్ డాలర్ల(రూ.117 కోట్లు) సేకరించినట్లు కంపెనీ ఫౌండర్, సీఈవో రాజు వనపాల తెలిపారు.వ్యాపారాన్ని విస్తరించడానికి, బ్రాండ్‌ను మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా ఈ నిధులను సేకరించినట్లు చెప్పారు. అలాగే వెంచర్ క్యాపిటలిస్ట్ శశి రెడ్డి కూడా పెట్టుబడులు పెట్టారు కూడా. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే.

## రిలయన్స్ డిజిటల్‌లో ఐఫోన్ 16




రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో ఐఫోన్ 16 అన్ని రకాల మాడళ్లు లభిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని స్టోర్లతోపాటు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో కూడా ఈ ఫోన్లు అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. ఈ ఫోన్లను ముందస్తు బుకింగ్ చేసుకున్నవారికి రిఫండ్ రెండుసార్లు అందిస్తున్నట్లు వెల్లడించింది.గతేడాది వచ్చిన ముందస్తు బుకింగ్‌లతో పోలిస్తే ఈ సారి ఐఫోన్ 16కి విశేష స్పందన లభించిందని, రెండింతలు బుకింగ్‌లు వచ్చాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. పలు క్రెడిట్ కార్డులపై రాయితీ కూడా ఇస్తున్నట్లు తెలిపింది.

## నాలుగు నెలల కనిష్ఠానికి టోకు ధరల సూచీ



టోకు ధరల సూచీ శాంతించింది. వరుసగా రెండో నెల ఆగస్టులోనూ టోకు ధరల సూచీ నాలుగు నెలల కనిష్ఠ స్థాయి 1.31 శాతానికి పడిపోయింది. కూరగాయలు, ఆహార, చమురు ధరలు తగ్గుముఖం పట్టడం వల్లనే ధరల సూచీ తగ్గిందని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.జూలై నెలలో 2.04 శాతంగా ఉన్న ధరల సూచీ..ఏడాది క్రితం మైనస్ 0.46 శాతంగా ఉన్నది. ఆహారపదార్థాల ధరల సూచీ 3.11 శాతంగా ఉన్నది.

## 108-ఎంపీ కెమెరాతో మార్కెట్లోకి హెచ్ఎండీ స్మార్ట్ ఫోన్ స్కైలైన్ ఇవీ డిటైల్స్

నోకియా బ్రాండ్ స్మార్ట్‌ఫోన్లు తయారుచేసే ఫిన్లాండ్ సంస్థ హెచ్ఎండీ గ్లోబల్ తన సొంత బ్రాండ్ పేరిట స్మార్ట్ ఫోన్ ను మంగళవారం భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. యూరప్ దేశాల్లో ఆవిష్కరించిన రెండు నెలల తర్వాత 'హెచ్ఎండీ స్కైలైన్' అనే పేరుతో ఆవిష్కరించిన ఈ ఫోన్ స్నాప్ డ్రాగన్ 7ఎస్ జెన్ 2 ప్రాసెసర్ తో పని చేస్తుంది. 12 జీబీ ర్యామ్, సెల్ఫ్ రిపేర్ కిట్ తోపాటు 4600 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తోంది. యూజర్లు డిస్ ప్లే, బ్యాటరీతోపాటు వివిధ విడి భాగాలను డిసెంబుల్ చేసి, రీ ప్లేస్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆండ్రాయిడ్ 14 ఓఎస్ వర్షన్ మీద పని చేస్తుందీ స్మార్ట్ ఫోన్. 108 మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరాతో కూడిన ట్రిపుల్ రేర్ కెమెరా సెటప్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 50-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి.హెచ్ఎండీ స్కైలైన్ 12 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.35,999 పలకుతుంది. నియాన్ పింక్, ట్విస్టెడ్ బ్లాక్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. ఈ-కామర్స్ ప్లాట్ ఫామ్ అమెజాన్‌తోపాటు హెచ్ఎండీ ఇండియా వెబ్‌సైట్, ప్రముఖ ఆఫ్ లైన్ రిటైల్ స్టోర్లలో లభ్యమవుతుంది. హెచ్ఎండీ స్కైలైన్ ఫోన్ 144 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 6.55 అంగుళాల ఫుల్ హెచ్డీం (1800ఐ2400 పిక్సెల్స్) పోలెడ్ స్క్రీన్, 1000 నిట్స్ పీక్ బ్రైట్ నెస్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 3 ప్రొటెక్షన్ కలిగి ఉంటుంది. ఆండ్రాయిడ్ 14 ఔటాఫ్ బాక్స్ ఓఎస్ వర్షన్ పై పని చేస్తుంది. 12 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీతో క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 7ఎస్ జెన్ 2 ఎస్వోసీ కలిగి ఉంటుంది.హెచ్ఎండీ స్కైలైన్ ఫోన్ ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ఓఐఎస్) మద్దతుతో 108 మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా, 50-మెగా పిక్సెల్ టెలిఫోటో కెమెరా, 13 మెగా పిక్సెల్ సెన్సర్ విత్ అల్ట్రా వైడ్ లెన్స్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 50-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. లెఫ్ట్ ఎడ్జ్ వైపు కస్టమ్ బటన్ ఉంటుంది. వేర్వేరు ఫంక్షనింగ్ ల కోసం కస్టమ్ బటన్ పని చేస్తుంది. 33వాట్ల ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 4600 ఎంఏహెచ్ కెపాసిటీ గల రీప్లేసబుల్ బ్యాటరీ ఉంటుంది. 15వాట్ల మ్యాగ్నటిక్ వైర్ లెస్, 5వాట్ల రివర్స్ వైర్ లెస్ చార్జింగ్ మద్దతు కలిగి ఉంటుందీ బ్యాటరీ. వై-ఫై 6ఈ, బ్లూటూత్ 5.2, జీపీఎస్, ఎన్ఎఫ్సీ, ఓటీజీ, యూఎస్బీ టైప్-సీ పోర్ట్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది. ఈ ఫోన్ కోసం చార్జర్ విడిగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సెక్యూరిటీ కోసం సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్ తో వస్తోందీ స్మార్ట్ ఫోన్.




## దేశ ఎగుమతి అధోగతి

**ఆగస్టులో 13 నెలల కనిష్ఠానికి క్షీణత**
**34.71 బిలియన్ డాలర్లకు పరిమితం**
**10 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు**
**రెండింతలైన బంగారం దిగుమతులు**



దేశీయ ఎగుమతులు దారుణంగా పడిపోయాయి. గత నెలలో ఏకంగా 9.3 శాతం క్షీణించాయి. గడిచిన 13 నెలల్లో ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఆగస్టులో ఆయా దేశాలకు భారత్ నుంచి జరిగిన ఎగుమతుల విలువ 34.71 బిలియన్ డాలర్లకే పరిమితమైంది. మరోవైపు వివిధ దేశాల నుంచి భారత్‌కు వచ్చిన దిగుమతుల విలువ 3.3 శాతం పెరిగి 64.36 బిలియన్ డాలర్లకు ఎగిసింది. ఇది రికార్డుస్థాయి కావడం గమనార్హం. దీంతోనే వాణిజ్య లోటు సైతం 10 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 29.65 బిలియన్ డాలర్లను తాకింది. ఈ మేరకు మంగళవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**వెల్లువలా పసిడి-వెండి**

ఆగస్టులో దేశంలోకి పసిడి, వెండి దిగుమతులు పెద్ద ఎత్తున జరిగాయి. వీటిలో బంగారం విలువ 10.06 బిలియన్ డాలర్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే నెలలో 4.93 బిలియన్ డాలర్లుగానే ఉన్నది. అలాగే వెండి దిగుమతులు 727 మిలియన్ డాలర్లకు ఎగిశాయి. నిరుడు 159 మిలియన్ డాలర్లే. దీంతో దేశీయ దిగుమతులు మొత్తంగా పెరగడానికీ ఇవి దోహదం చేశాయి. నిజానికి దేశీయ దిగుమతుల్లో క్రూడాయిల్ వాటానే ఎక్కువ. దేశ ఇంధన అవసరాల్లో 80 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. కానీ పెట్రోలియం ధరలు తక్కువగా ఉండటంతో ముడి చమురు దిగుమతులు ఈ ఆగస్టులో 11 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి.క్రిందటి ఏడాది ఆగస్టుతో చూస్తే ఇది 32.38 తక్కువ. కానీ ఇదే స్థాయిలో బంగారం, వెండి దిగుమతులుండటం.. ఈసారి వాణిజ్య లోటును ఎగదోసింది. అయితే కస్టమ్స్ సుంకాల కోత, పండుగ సీజన్ డిమాండ్ వల్లే ఈ స్థాయిలో గోల్డ్, సిల్వర్ ఇంపోర్ట్స్ జరిగాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అంటున్నది. కస్టమ్స్ సుంకాల తగ్గింపు.. స్మగ్లింగ్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలను తగ్గుముఖం పట్టేలా చేసిందని వాణిజ్య కార్యదర్శి సునీల్ భరత్‌వాల్ చెప్తున్నారు. ఈ ఏడాది జూలైలో ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి దించిన సంగతి విదితమే.

**సరిహద్దుల్లో కుస్తీ..**

వాణిజ్యంలో దోస్తీ అన్నట్టుగా చైనాతో కేంద్ర ప్రభుత్వం వైఖరి సాగుతున్నది. గత నెల చైనాకు భారత్ నుంచి ఎగుమతులు 22.44 శాతం పతనమై 1 బిలియన్ డాలర్లకు పరిమితమైతే.. చైనా నుంచి భారత్‌కు దిగుమతులు 15.55 శాతం పెరిగి 10.8 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఏప్రిల్-ఆగస్టు మధ్య చైనాకు భారతీయ ఎగుమతులు గతంతో చూస్తే 8.3 శాతం దిగజారి 5.8 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. కానీ చైనా నుంచి భారత్‌కు దిగుమతులు 10.96 శాతం ఎగబాకి 46.65 బిలియన్ డాలర్లను తాకాయి. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటు 35.85 బిలియన్ డాలర్లుగా ఉన్నది.2013-14 నుంచి 2017-18 వరకు అలాగే 2020-21లో భారత్‌కు చైనానే అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఇక అమెరికా, యూఏఈ, సింగపూర్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్, నేపాల్, బెల్జియం, టర్కీ దేశాలకూ భారత్ నుంచి ఎగుమతులు గత నెల పడిపోయాయి. ఇదే సమయంలో యూఏఈ, స్విట్జర్లాండ్, కొరియా, జపాన్, థాయిలాండ్, వియత్నాం, తైవాన్ దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పెరిగాయి. మొత్తానికి అంతర్జాతీయ ఆర్థిక మందగమనం, ఎర్ర సముద్రం సంక్షోభం.. భారతీ ఎగుమతుల్ని దెబ్బతీశాయని కేంద్రం తాజా పరిస్థితులను వెనకేసుకొస్తున్నప్పటికీ, ఇతర దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పెరగడం.. దేశీయ తయారీ రంగాన్ని వెక్కిరిస్తోందని పలువురు ఆర్థిక నిపుణులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## జియో దీపావళి ధమాకా ఆఫర్.. ఏడాదిపాటు ఇంటర్‌నెట్ ఫ్రీ

Jio AIRFIBER

దసరా, దీపావళి పండుగలు వస్తున్న నేపథ్యంలో అనేక కంపెనీలు కస్టమర్లను ఆకర్షించేందుకు అనేక ఆఫర్లను ప్రకటిస్తుంటాయి. ఈ క్రమంలోనే రిలయన్స్ జియో 'దీపావళి ధమాకా' ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ఆఫర్ ద్వారా వినియోగదారులు సంవత్సరం పాటు ఉచిత కనెక్షన్‌ని పొందవచ్చు. దీని ద్వారా మీరు సంవత్సరం పాటు ఉచిత ఇంటర్నెట్‌ని ఆస్వాదించవచ్చు. ఈ ఆఫర్ సెప్టెంబర్ 18 నుంచి నవంబర్ 3, 2024 వరకు మాత్రమే కొనుగోళ్లు చేసే కస్టమర్‌లకు అందుబాటులో ఉంటుంది. అయితే ఈ ఆఫర్ షరతులు ఏంటి, ఎలా తీసుకోవాలనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.

**12 నెలల పాటు**

ఈ ఆఫర్‌ను పొందేందుకు కొత్త కస్టమర్లు రిలయన్స్ డిజిటల్ లేదా స్టోర్ల నుంచి రూ. 20,000 కంటే ఎక్కువ విలువైన వస్తువులను కొనుగోలు చేయాలి లేదా కొత్త ఎయిర్‌ఫైబర్ కనెక్షన్ కోసం రూ. 2,222 మూడు నెలల అడ్వాన్స్ ప్లాన్ తీసుకోవాలి. ప్రస్తుతం ఉన్న జియో కస్టమర్లు దీపావళి ప్లాన్‌తో వన్ టైమ్ అడ్వాన్స్ రీఛార్జ్ చేయడం ద్వారా ఈ ఆఫర్‌ను పొందవచ్చు. ఈ ఆఫర్ కింద అర్హత కలిగిన కస్టమర్లు 12 నెలల పాటు ఉచిత సభ్యత్వాన్ని పొందుతారు. మీరు ఈ కూపన్‌ను 30 రోజుల్లోగా రీడీమ్ చేసుకోవాలి.

**కస్టమర్లకుజి**

అదే సమయంలో ఈ కూపన్‌లను రిలయన్స్ డిజిటల్, స్టోర్‌లు, స్టోర్‌లు డిజిటల్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌లలో రూ. 15,000 కంటే ఎక్కువ కొనుగోలు చేసేటప్పుడు రీడీమ్ చేసుకోవచ్చు. ఈ ఆఫర్ ద్వారా తమ కస్టమర్లకు దీపావళి షాపింగ్ సమయంలో మెరుగైన అనుభూతిని అందించాలనుకుంటున్నట్లు కంపెనీ తెలిపింది. అంతేకాకుండా డిజిటల్ కనెక్టివిటీని ప్రోత్సహించడమే కంపెనీ లక్ష్యమని వెల్లడించింది.ఈ ఆఫర్‌తో అనేక మంది కస్టమర్లు ఉచిత సబ్‌స్క్రిప్షన్‌ను పొందే అవకాశం ఉంది. అలాగే వినియోగదారులు ఆఫర్ కింద అందుబాటులో ఉన్న కూపన్‌లను నవంబర్ నుంచి అక్టోబర్ 2025 వరకు మాత్రమే ఉపయోగించుకోవాలి. గత నెల రిలయన్స్ ఇండస్ట్రీస్ 47వ వార్షిక సర్వసభ్య సమావేశంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ ఈ దీపావళి నుంచి జియో వినియోగదారులకు 100 వరకు ఉచిత క్లౌడ్ స్టోరేజీని అందించనున్నట్లు ప్రకటించారు.

## నాలుగున్నరేళ్లలో లక్షను రూ.29 లక్షలు చేసిన స్టాక్ ఏకంగా 2818 శాతం గ్రోత్

ప్రస్తుతం స్టా మార్కెట్ చాలా కంపెనీలు తమ ఇన్వెస్టర్లకు మంచి రాబడులను అందిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన కంపెనీ రిలయన్స్ పవర్ కూడా దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు మంచి లాభాలను అందించింది. అంతేకాదు దీనిలో ఇన్వెస్ట్ చేసిన పెట్టుబడిదారులను ధనవంతులను చేసింది. అయితే ఎన్నేళ్లలో ధనవంతులయ్యేరనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. గత కొన్ని రోజులుగా రిలయన్స్ పవర్ షేర్లు రాకెట్ లా దూసుకుపోతున్నాయి. అనిల్ అంబానీ కంపెనీ పవర్ షేర్లు బుధవారం(సెప్టెంబర్ 18న) 5 శాతం పెరిగి రూ.32.98కి చేరాయి.రిలయన్స్ పవర్‌కి సంబంధించి పెద్ద అప్‌డేట్ వచ్చిన నేపథ్యంలో ఈ షేర్లు పుంజుకున్నాయి. రిలయన్స్ పవర్ విదర్భ ఇండస్ట్రీస్ పవర్ లిమిటెడ్ లేదా పవర్ జనరేషన్ కంపెనీకి గ్యారెంటర్‌గా తన ఆర్థిక బాధ్యతను పూర్తిగా నిర్వర్తించినట్లు సెప్టెంబర్ 17న ప్రకటించింది. ఈ నేపథ్యంలో అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్‌కు బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో ఎలాంటి అప్పులు లేవని స్పష్టం చేసింది. జూన్ 30, 2024 వరకు మొత్తం ప్రాతిపదికన కంపెనీ నికర విలువ రూ.11,155 కోట్లు అని కంపెనీ తెలిపింది. విదర్భ ఇండస్ట్రీస్ పవర్ లిమిటెడ్ తన అనుబంధ సంస్థ కాదని, రిలయన్స్ పవర్ తన ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో పేర్కొంది. %జఖీవీ% అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కంపెనీ అన్ని వివాదాలను పరిష్కరించుకున్నట్లు వెల్లడించింది.

**2818 శాతం పెరుగుదల**

దీంతో సెప్టెంబర్ 18, 2024న ఈ కంపెనీ షేర్లు రూ.32.98కి చేరుకున్నాయి. ఈ క్రమంలోనే గత నాలుగున్నరేళ్లలో రిలయన్స్ పవర్ షేర్లు 2818 శాతం పెరగడం విశేషం. అనిల్ అంబానీ కంపెనీ షేర్లు మార్చి 27, 2020న రూ.1.13గా ఉండేవి. కానీ ప్రస్తుతం సెప్టెంబర్ 18, 2024 నాటికి ఈ కంపెనీ షేరు ధర రూ.32.98కి చేరుకుంది. అంటే నాలుగున్నరేళ్లలోనే 2800 శాతానికిపైగా పుంజుకుంది. ఈ నేపథ్యంలో ఒక వ్యక్తి మార్చి 27, 2020న రిలయన్స్ పవర్ షేర్లలో రూ. 1 లక్ష పెట్టుబడి పెట్టి, తన పెట్టుబడి మొత్తాన్ని అలాగే ఉంచినట్లయితే షేర్ల ప్రస్తుత ధర రూ.32.98 ప్రకారం రూ. 29.18 లక్షలు వచ్చాయని చెప్పవచ్చు.

**గరిష్టం**



రిలయన్స్ పవర్ షేర్లు 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.38.07కి చేరుకోగా, కంపెనీ షేర్లు 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.15.53గా ఉంది. గతేడాదితో పోలిస్తే 73 శాతం వృద్ధి నమోదైంది. సెప్టెంబర్ 18, 2023న ఈ కంపెనీ షేరు విలువ రూ. 19.07గా ఉండేది. ప్రస్తుతం రిలయన్స్ పవర్ షేర్ సెప్టెంబర్ 18, 2024న రూ.32.98కి చేరుకుంది. గత 6 నెలల్లో కంపెనీ షేర్లు 42 శాతం పెరిగాయి. ఈ కాలంలో కంపెనీ షేర్లు రూ.23.23 నుంచి రూ.33కి పెరిగాయి.

## 83,000పైకి సెన్సెక్స్

**25,400 ఎగువ స్థాయికి నిఫ్టీ .. సరికొత్త శిఖరాలకు సూచీలు**




ప్రామాణిక ఈక్విటీ సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను చేరుకున్నాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 90.88 పాయింట్ల లాభంతో 83,079.66 వద్ద, నిఫ్టీ 34.80 పాయింట్ల వృద్ధితో 25,418.55 వద్ద ఆల్‌టైం రికార్డు ముగింపును నమోదు చేశాయి. అంతేకాదు, సెన్సెక్స్ 83,000, నిఫ్టీ 25,400 ఎగువన స్థిరపడటం కూడా ఇదే తొలిసారి. సూచీలు వరుసగా రెండో రోజు పాజిటివ్ జోన్‌లోనే కొనసాగినప్పటికీ, అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లపై నిర్ణయాన్ని బుధవారం ప్రకటించనున్న నేపథ్యంలో పరిమిత శ్రేణిలో ట్రేడయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో సగం లాభపడ్డాయి. ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, ఎం అండ్ ఎం షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి. కాగా, బీఎసఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.13 శాతం వరకు తగ్గాయి. రంగాలవారీ సూచీల్లో రియల్టీ, టెలికాం, యుటిలిటీస్, టెక్, ఆటో స్వల్పంగా లాభపడ్డాయి. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 10 పైసలు పెరిగి 83.76 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒకదశలో 0.25 శాతం తగ్గి 72.52 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.స్టాక్ ఎక్స్ఛేంజీల్లో సోమవారం లిస్టయిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ షేర్లు వరుసగా రెండో రోజు అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. తాజా సెషన్‌లో కంపెనీ షేరు ధర మరో 10 శాతం పెరిగి రూ.181.48కి చేరుకుంది. ఐపీఓ ధర రూ.70తో పోలిస్తే, మొదటి రెండ్రోజుల్లోనే షేరు 159 శాతం పుంజుకుంది.ఓలా ఎలక్ట్రిక్ షేరు ఇంట్రాడేలో 10 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.118.40 వద్దకు చేరుకుంది.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com